క్లుప్తంగా

భవానీ మాలధారుల శోభాయాత్ర



కడియంలో భవానీ మాలధారుల శోభాయాత్ర

కడియం: భవానీ మాలధారుల శోభాయాత్ర కడియంలో గురువారం వైభవంగా నిర్వహించారు. హిందూ ధర్మ ప్రచార సమితి కడియం శాఖ ఆధ్వర్యాన గ్రామ ప్రముఖులు పిండి మూర్తి నిర్వహణలో ఈ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భవానీ మాలధారులు, భక్తులు పాల్గొన్నారు. కాషాయ జెండాలు, కలశాలను చేతుల్లో పట్టుకుని గ్రామంలోని ప్రధాన వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. సర్వేజనా సుఖినోభవంతు అనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ కస్తూరీదేవి జెండా ఊపి ఈ యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు రమణ, కందుకూరి వెంకటేశ్వరరావు, చిక్కాల ఈశ్వరరావు, బమ్మిరెడ్డి వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా ఉత్తమ జిల్లా అధ్యక్షుడిగా కాలెపు



సత్యసాయిరామ్‌ను సత్కరిస్తున్న ఓబీసీ మోర్చా నేతలు

రాజమహేంద్రవరం సిటీ: కాలెపు సత్యసాయిరామ్ బీజేపీ ఓబీసీ మోర్చా ఉత్తమ జిల్లా అధ్యక్షుడిగా గుర్తింపు పొందారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుల సమావేశం గురువారం జరిగింది. ఇందులో పాల్గొన్న ఓబీసీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి నిఖిల్ ఆనంద్, జాతీయ ఓబీసీ మోర్చా కార్యదర్శి డాక్టర్ పార్థసారథిలు.. సత్యసాయిరామ్ చేపట్టిన కార్యక్రమాలను ప్రశంసించారు. ఓబీసీ మోర్చాకు సంబంధించి రాష్ట్రంలో ఉత్తమ జిల్లాగా గుర్తించి, ఆయనను అభినందించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కూడా సత్యసాయిరామ్‌ను అభినందించారు. ఆయనను మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ ఆధ్వర్యాన సత్కరించారు.

ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం'



స్వయంగా గీసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన గురువారం 'చదవడం మాకిష్టం' ఐదో రోజు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. చివరి రోజుల్లో కుతుబుద్దీన్ ఐబాక్ జీవితం, మర్యాదరామన్న కథలు, ఇంగ్లిషు గ్రామర్‌లో మెళకువలను మొగల్తూరు ప్రతిభా స్కూల్ ప్రిన్సిపాల్ ఆకన రవిచంద్ర వివరించారు. విద్యార్థులు స్వయంగా పలు చిత్రాలు గీశారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలి

ధవళేశ్వరం: గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పంచాయతీ అధికారులకు సూచించారు. రామపాదాల రేవును గురువారం ఆయన పరిశీలించారు. కార్తిక మాసం సమీపిస్తున్నందున రేవులో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, ధవళేశ్వరం టౌన్ ప్రెసిడెంట్ పందూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్య భాగ్యం

- పలు ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- వందలాది మందికి వైద్య సేవలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రజలందరికీ ఆరోగ్య భాగ్యాన్ని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిరంతరాయంగా జరుగుతున్నాయి. నగరంలోని మెరక వీధి, శంభూ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల(యూపీహెచ్‌సీ)తో పాటు వెంకటనగరం గ్రామ సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన శిబిరాల్లో 1,266 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఈసీజీ, రక్త, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయా శిబిరాల్లో నగరపాలక సంస్థ అధికారులు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

- మెరక వీధి యూపీహెచ్‌సీలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 354 మందికి వైద్య సేవలు అందించారు. 11 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. స్పెషలిస్టులు భారతి, కౌశిక్, డెంటిస్టులు శిరీష, గౌతమి, మెడికల్ ఆఫీసర్లు దిలీప్ కృష్ణ, అశోక్ కుమార్ వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని నగరపాలక సంస్థ సెక్రటరీ సత్యవతి, వైఎస్సార్ సీపీ నేత వనం వెంకటేశ్వరరావు సందర్శించారు.
- శంభూ నగర్ యూపీహెచ్‌సీ పరిధిలో ఆల్కాట్‌తోట 48వ వార్డు సచివాలయానికి సంబంధించి మున్సిపల్ కల్యాణ మండపంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 388 మందికి వైద్య సేవలు అందించారు. ఐదుగురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. రోగులకు స్పెషలిస్టు వైద్యులు గోలి వికాస్, చైతన్య శేఖర్, మెడికల్ ఆఫీసర్లు మనోజ్, లలిత వైద్య సేవలు అందించారు. పౌష్టికాహారంపై అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, జిల్లా కార్యదర్శి కొప్పిసెట్టి ప్రసాద్ (రాజమౌళి), సచివాలయ కన్వీనర్లు ధవళ కోటేశ్వరరావు, కిలిమి నారాయణరెడ్డి, దుంపా చంద్రారెడ్డి, షేక్ ఇమామ్, పడమటి కామరాజు, అంగాడి సత్యప్రియ, నాగమణి, నరసింహులు, అంజిబాబు, మేడపాటి కృష్ణారెడ్డి, సోమశేఖర్, చైతు ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధులు పాల్గొన్నారు.
- వెంకటనగరం గ్రామ సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 524 మందికి వైద్య సేవలు అందించారు. 14 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్, సచివాలయ కన్వీనర్లతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించారు. రోగులకు స్పెషలిస్ట్ వైద్యులు అరవింద్, యోషిత, పీహెచ్‌సీ వైద్యులు ఇ.నాగదేవి, రౌతు జగదీష్ కృష్ణ, ఎ.మేరీ లిడియా సుచిత వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని జిల్లా పంచాయతీ అధికారి జె.సత్యనారాయణ సందర్శించి, వైద్యులకు పలు సూచనలు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యాన అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సచివాలయ కన్వీనర్లు మోతా రమేష్, గండ్రోతు విష్ణు, తలారి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి చెరుకూరి రాణి తదితరులు పాల్గొన్నారు.



కడియపులంక వైద్య శిబిరానికి హాజరైన గ్రామస్తులు



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్ తదితరులు



మున్సిపల్ కల్యాణ మండపంలో జరిగిన శిబిరంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న మింది నాగేంద్ర తదితరులు



వెంకట నగరం శిబిరంలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ

జగనన్న ఆరోగ్య సురక్షతో కార్పొరేట్ వైద్యం

కడియం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా గ్రామాల్లోని ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వచ్చిందని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. కడియపులంక సచివాలయం-2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని చెప్పారు. ఇందులో భాగంగానే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై సర్వే చేయడంతో పాటు, అవసరమైన వారికి ఆయా గ్రామాల్లోనే స్పెషలిస్టు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారని అన్నారు. సాధారణ రక్త పరీక్షలు మొదలుకొని అత్యాధునిక పరీక్షల వరకూ ఈ శిబిరాల వద్ద నిర్వహిస్తున్నారని చెప్పారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా నమోదు ప్రక్రియ కూడా చేపడుతున్నారన్నారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు, మందులు శిబిరాల వద్దనే అందిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లోని ప్రజల అవసరాలను బట్టి ఐదు రకాల స్పెషలిస్టు వైద్యులను ప్రతి శిబిరానికి కేటాయిస్తున్నారన్నారు. పేదలకు క్రమపద్ధతిలో వైద్య పరీక్షలు చేయడం, పాత రోగుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వంటి కార్యాచరణను కూడా వైద్య సిబ్బంది చేపడుతున్నారని చందన తెలిపారు. రాష్ట్రంలో ఆరోగ్యపరంగా ఎవరికి ఏ అవసరం వచ్చినా, ఎంతటి ఖరీదైన వైద్యమైనా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమాల ద్వారా నిత్యం పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. నాణ్యమైన మందులతో పాటు, అవసరమైన వారికి పౌష్టికాహారం కూడా అందిస్తున్నారని నాగేశ్వర్ తెలిపారు. అనంతరం రోగులకు ఆయన కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రత్నకుమారి, జేసీఎస్ మండల కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, సొసైటీ బ్యాంకు త్రీమెన్ కమిటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

శక్తిస్వరూపిణి.. ఐశ్వర్యదాయిని



శ్రీ ఉమా మార్కండయేశ్వర స్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



రబ్బరు బ్యాండ్ల అలంకరణలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

- దేవీచౌక్‌లో శ్రీమహాలక్ష్మీదేవిగా అమ్మవారు
- ఇతర ఆలయాల్లో వివిధ రూపాల్లో అలంకరణ
- అధిక సంఖ్యలో దర్శించిన భక్తులు

సీటీఆర్ఐ: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు కోలాహలంగా జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ పరిధిలోని అన్ని ఆలయాల్లో అమ్మవార్లు ఐదో రోజైన గురువారం వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. అమ్మవారిని ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించారు. కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- దసరా ఉత్సవాలకు ప్రసిద్ధి చెందిన దేవీచౌక్‌లో శ్రీ బాలాత్రిపురసుందరీదేవిని శ్రీమహాలక్ష్మిగా అలంకరించారు. అమ్మవారిని దర్శించేందుకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే కుంకుమ పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. మంగళప్రదమైన దేవత మహాలక్ష్మీదేవి. ముగురమ్మల్లో ఒకరైన మహాలక్ష్మీ స్వరూపంలో జగన్మాత.. అమిత పరాక్రమంతో హాలుడు అనే రాక్షసుడిని సంహరించింది. లోక స్థితికారిణిగా ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, గజ, సంతాన లక్ష్మిగా అష్టైశ్వర్యాలను ప్రసాదించే అష్టలక్ష్మీ సమష్టి రూపమైన అమృత స్వరూపాణిగా భావించి అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకరించారు. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం వల్ల ఐశ్వర్య ప్రాప్తి, విజయం లభిస్తాయని భక్తులు విశ్వసిస్తారు.
- గోదావరి గట్టున ఉన్న శ్రీ ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో స్వయంభువుగా వెలసిన పార్వతీ మాతను శ్రీఅన్నపూర్ణ దేవిగా అలంకరించారు.
- శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని రబ్బరు బ్యాండ్లు, బాల్స్‌తో అలకరించారు.

జయహో దుర్గాభవాని



మోరంపూడి సాయినగర్‌లో శ్రీ విజయ కనక దుర్గాదేవి ఆలయంలో శ్రీమహాలక్ష్మిగా అమ్మవారు

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లోని శ్రీ విజయ కనకదుర్గాదేవి సన్నిధిలో 33వ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆలయ గౌరవాధ్యక్షుడు పిల్లి శ్రీను నేతృత్వంలో అమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు ఈ విషయం తెలిపారు. బాలాజీపేట సెంటర్‌లోని శ్రీ విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని శ్రీ మహా చండీదేవిగా అలంకరించారు.

- అక్షరకోటి గాయత్రీ శ్రీచక్ర పీఠం, శారదా మఠం, శంకర మఠం, సరస్వతీ ఘాట్, శ్రీసారంగధరేశ్వర స్వామి వారి దేవాలయం, శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి దేవాలయం, శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు.

టీడీపీ నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- స్థానికుల విజ్ఞప్తిపై స్వతంత్ర పెట్రోలు బంకు ప్రాంతంలో పర్యటన
- సమస్య పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



స్వతంత్ర పెట్రోలు బంకు ప్రాంతంలో పర్యటిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థగా రూపుదాల్చిన తరువాత రాజమహేంద్రవరంలో వరుసగా మూడుసార్లు టీడీపీ అధికారం చేపట్టిందని, వారి నిర్లక్ష్యమే నగర ప్రజలకు శాపంగా మారిందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. దశాబ్దాల కాలం నుంచి దుర్గంధ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దీనిని పరిష్కరించాలని కంబాల చెరువు సమీపంలోని స్వతంత్ర పెట్రోలు బంకు ప్రాంత ప్రజలు ఆయనకు మొర పెట్టుకున్నారు. దీనిపై స్పందించిన ఎంపీ భరత్‌రామ్.. గురువారం స్వయంగా ఆ ప్రాంతంలో పర్యటించారు. ఇరుకు సందులు, ఇళ్ల మధ్య చిన్నచిన్న కాలువల వల్ల డ్రెయినేజీల్లోని నీరంతా బయటకు పొంగి పొర్లుతూ అస్తవ్యస్తంగా ఉన్న ఆ వీధులను పరిశీలించారు. ఈ దుస్థితికి కారణమేమిటని అక్కడే ఉన్న నగరపాలక సంస్థ జేఈని అడిగారు. ఇక్కడి కాలువలు వెడల్పు, లోతు తక్కువగా ఉన్నాయని, దీంతో చిన్నపాటి వర్షానికే వాటిల్లోని నీరు రోడ్లపైకి పొంగి పొర్లుతూ ప్రజలకు ఇబ్బందికరంగా మారుతోందని జేఈ వివరించారు. ఆ కాలువలను వెడల్పు, లోతు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించి, త్వరితగతిన పనులు చేపట్టాలని ఎంపీ ఆదేశించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ, వరుసగా మూడుసార్లు టీడీపీ మేయర్లు అధికారం చేపట్టారని, ఆ పార్టీ నేతలు ఇటువంటి సమస్యలు కూడా పరిష్కరించకపోవడం దారుణమని విమర్శించారు. నగర అభివృద్ధిని విస్మరించి, కేవలం సొంత అభివృద్ధిపై మాత్రమే శ్రద్ధ చూపారని, అందువల్లనే ఇటువంటి సమస్యలు తిష్ట వేసి, ప్రజల ఆరోగ్యాలను పాడు చేస్తున్నాయని అన్నారు. కొన్ని దశాబ్దాలుగా ప్రజలు సమస్యలతో బాధ పడుతున్నా, ఏ ఒక్కరూ పట్టించుకోలేదంటే టీడీపీ నేతలు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో అర్థమవుతుందని దుయ్యబట్టారు. ఈ ప్రాంత ప్రజల సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకునేలా నగరపాలక సంస్థ అధికారులతో చర్చిస్తామని, యుద్ధప్రాతిపదికన పనులు చేపడతామని ఎంపీ భరత్‌రామ్ హామీ ఇచ్చారు.

జగనే మళ్లీ సీఎం కావాలి

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో 30వ డివిజన్ ప్రజలు
- కార్యక్రమం నిర్వహించిన డాక్టర్ గూడూరు శ్రీనివాస్



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: దేవుడి దయవల్ల జగనన్నే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నామని స్థానిక చర్చిపేట, మేదరపేట ప్రజలు ఆకాంక్షించారు. స్థానిక 30వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరు శ్రీనివాస్ గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు ఏ మేరకు అందాయో ఆరా తీశారు. చివరి లబ్ధిదారు వరకూ సంక్షేమం అందాలనే లక్ష్యంతో అర్హులైన ఏ ఒక్కరూ మిగిలిపోకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చిన డ్రైనేజీ, తాగునీరు, వీధిలైట్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో స్థానికులు మాట్లాడుతూ, వలంటీర్లు ప్రభుత్వ పథకాలను నేరుగా ఇంటికే తీసుకుని వచ్చి అందిస్తున్నారని డాక్టర్ శ్రీనివాస్‌కు చెప్పారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి కాటం ప్రియాంక, ఎస్సీ సెల్ నగర చైర్మన్ కాటం రజనీకాంత్ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీప్రియ, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రూరల్‌లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలి

- సీఎం జగన్‌కు గిఫ్ట్‌గా ఇవ్వాలి
- బీసీల ఆత్మీయ సమావేశంలో చందన నాగేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

కడియం: రాబోయే ఎన్నికల్లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గిఫ్ట్‌గా ఇవ్వాలని ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను అధ్యక్షతన మాధవరాయుడుపాలెం చైతన్య నగర్‌లో గురువారం రాత్రి బీసీల ఆత్మీయ సమావేశం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న చందన నాగేశ్వర్ మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు సముచిత స్థానం కల్పించారని అన్నారు. ఆయనకు బీసీలందరూ అండగా నిలచి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ నెలలో జరిగే బీసీల ఆత్మీయ సదస్సుకు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని చందన నాగేశ్వర్ పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో డ్రైనేజీలను పరిశీలించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రానా హరిశ్చంద్ర విమల, వార్డు సభ్యులు పోనగండి దేవి, లోవరాజు, కె.హనుమంతు, హేమలత, త్రిమూర్తులు, చిరంజీవి, వెంకన్న, కుమార్, రాము, బీసీ నేతలు పాల్గొన్నారు.

అమ్మవారికి భారీ సారె



దేవీ నవరాత్రుల సందర్భంగా సీతానగరం వెలమపేట రామాలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ కనకదుర్గ అమ్మవారికి గురువారం 108 రకాల పిండివంటలతో భక్తులు భారీ సారె సమర్పించారు. ఈ వంటకాలను 250 బిందెల్లో ఉంచి మహిళలు ఊరేగింపు నిర్వహించారు.

- సీతానగరం

సినిమాలు



శ్యామల: లియో
సూర్యా మినీ: టైగర్ నాగేశ్వరరావు
సూర్యా ప్యాలెస్: భగవంత్ కేసరి
స్వామి: టైగర్ నాగేశ్వరరావు
శివజ్యోతి: లియో
అనుశ్రీ: భగవంత్ కేసరి
రాజా: టైగర్ నాగేశ్వరరావు
అశోక్: భగవంత్ కేసరి
ఊర్వశి: టైగర్ నాగేశ్వరరావు
రంభ: భగవంత్ కేసరి
మేనక: లియో
అప్సర: లియో

నామవరం:
వీఎస్ మహల్: టైగర్ నాగేశ్వరరావు

ధవళేశ్వరం:
మురళీకృష్ణ: భగవంత్ కేసరి, లియో

కడియం:
వెంకట సూర్య: టైగర్ నాగేశ్వరరావు

కరెంటుకు కటకట లేకుండా..

- నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు చర్యలు
- కొత్తగా సబ్ స్టేషన్ల నిర్మాణం
- వ్యవసాయ రంగానికి ప్రత్యేక ఫీడర్లు

రాజానగరం నియోజకవర్గంలో	
సబ్ స్టేషన్లు	13
రాజానగరం మండలం	7
కోరుకొండ	3
సీతానగరం	3
మొత్తం వ్యవసాయ కనెక్షన్లు	9,890
నెలకు ఒక వ్యవసాయ కనెక్షన్ (1 హెచ్‌పీ - హార్స్‌పవర్ మోటార్)	
సగటు విద్యుత్ వినియోగం	250 - 300 యూనిట్లు

మధురపూడి: వ్యవసాయం దండగ కాదు.. పండగ కావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పటిష్ట కార్యాచరణ చేపట్టారు. రైతును రాజును చేయాలనే దృక్పథంతో వివిధ పథకాలు అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు విద్యుత్ అధికారులు అదనపు సబ్ స్టేషన్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో పాటు లోడు తగ్గించేందుకు ఫీడర్లను విడదీస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నెల నాటికి వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు చేపట్టారు.

గతం దయనీయం.. నేడు ఘనం

గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా దయనీయంగా ఉండేది. కేవలం 7 గంటల పాటు, అది కూడా రెండు షిఫ్టులుగా పగలు, రాత్రి వేళల్లో సరఫరా చేసేవారు. అలాగే ప్రతి వ్యవసాయ కనెక్షన్‌కు 130 నుంచి 170 యూనిట్ల విద్యుత్ మాత్రమే సరఫరా జరిగేది. చాలీచాలని కరెంటు.. అది కూడా రెండు విడతలుగా ఇవ్వడంతో రైతులు ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత ఈ పరిస్థితిని పూర్తిగా మార్చారు. రైతుల కష్టాలను గట్టెక్కించేందుకు ఒక్కో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు నిరంతరాయంగా 9 గంటల పాటు 250 నుంచి 300 యూనిట్ల వరకూ విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

కొత్తగా 3 సబ్ స్టేషన్ల నిర్మాణం

రాజానగరం నియోజకవర్గంలో 9,890 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో మొత్తం 13 సబ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి ద్వారా వ్యవసాయ రంగానికి నిరాటంకంగా 9 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. సరఫరాలో లోపాలు లేకుండా చూసేందుకు మరికొన్ని సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నారు. వీటిలో రాజానగరం మండలం రాధేయపాలెంలో సబ్ స్టేషన్ నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యింది. కోరుకొండ మండలం నర్సాపురం, సీతానగరం మండలం చినకొండేపూడిలో సబ్ స్టేషన్లు నిర్మాణ దశలో ఉన్నాయి. అలాగే, రానున్న వేసవిలో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా, విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేందుకు వీలుగా అవసరమైన చోట్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు గ్రామీణ ప్రాంతంలోని చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కూడా 3 ఫేజ్ విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గృహ వినియోగదారులకు సరఫరా జరిగే ఫీడర్ ద్వారానే వ్య వసాయ విద్యుత్ సరఫరా కూడా జరుగుతూండటంతో లోడ్ అధికమై, ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇప్పుడు ఈ ఫీడర్లను విడదీసి, వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా సరఫరా చేసేందుకు కార్యాచరణ చేపట్టారు.



రాజానగరం మండలం రాధేయపాలెంలో పూర్తయిన సబ్ స్టేషన్ నిర్మాణం

మార్చి నాటికి..



వచ్చే ఏడాది మార్చి నెల నాటికి వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేలా కార్యాచరణ చేపట్టాం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరాలో భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. తద్వారా లైన్‌మన్లు, హెల్పర్లు ప్రమాదాలకు గురి కాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– దాట్ల శ్రీధర్‌వర్మ, ఈఈ, ఈపీడీసీఎల్